క్లుప్తంగా

కేంద్రం నిధులతోనే అభివృద్ధి

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్రం నుంచి వచ్చిన నిధులతోనే గ్రామాల్లో వైకుంఠధామాలు, సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులు జరిగాయని మానకొండూర్ బీజేపీ అభ్యర్థి ఆరెపల్లె మోహన్ పేర్కొన్నారు. మండలంలోని గుగ్గిల్ల, చిలాపూర్, రేగులపల్లె, తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అంతరం బెజ్జంకి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈసారి బీజేపీకి అవకాశమిచ్చి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, కొలిపాక రాజు, బుర్ర మల్లేశం, జ్యోతి, సత్యనారాయణగౌడ్, సంగ రవి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీపీఎస్‌ను రద్దు చేయాలని డీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. గురువారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలు, డీఏ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు శంకర్, సత్తయ్య, సంతోష్, నరేందర్, వెంకటేశ్వర్లు, సోమాచారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'డీఏ ప్రకటించండి'

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే డీఏ ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టపల్లి రంగారావు డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మ్యాడ శ్రీధర్, మండల అధ్యక్షుడు ఉపేందర్, ఉపాధ్యాయులు రామచంద్రం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నర్మెట విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ క్రీడా పోటీల్లో నర్మెట ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని ఎంఈఓ దేశిరెడ్డి, పీఈటీ రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. దుబ్బాక మండల ఆకారంలో జరిగిన టెన్నిస్, వాలీబాల్ అండర్-14 బాలికల పోటీలో తమ పాఠశాల విద్యార్థులు గుండెల్లి వైష్ణ, అండర్ -17 విభాగంలో చేర్యాల వైష్ణవి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అలాగే మెదక్‌లో జరిగిన చెస్ అండర్- 17 విభాగంలో పాఠశాలకు చెందిన నీరజ్‌కుమార్ ఎంపికయ్యాడని చెప్పారు.

గజ్వేల్ తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



బీఆర్ఎస్ నాయకుల బైక్ ర్యాలీ

ములుగు(గజ్వేల్): గజ్వేల్ బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ నామినేషన్ సందర్భంగా వంటిమామిడి ఏఎంసీ చైర్మన్ జహంగీర్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. జై కేసీఆర్ అంటూ నినాదాలు హోరెత్తించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జయమ్మ అర్జున్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ వైస్ చైర్మన్లు నరేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గణేష్‌గుప్త, లింగారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన కార్యదర్శి జుబేర్‌పాషా, మండల ప్రధాన కార్యదర్శి బాబుగౌడ్, నాయకులు నర్సింహారెడ్డి, కొన్యాల బాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కర్ణాకర్‌రెడ్డి, బాపురెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): సీఎం కేసీఆర్ నామినేషన్ కార్యక్రమానికి కొండపాక, కుకునూరుపల్లి మండలాల నుంచి గులాబీ శ్రేణులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, భారత జాగృతి రాష్ట్ర కన్వీనర్ అనంతుల ప్రశాంత్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

గజ్వేల్‌రూరల్: శబరిమలకు ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ సురేఖ పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. భక్తుల కోసం అద్దె ప్రతిపాదికన ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నాయని, బస్సులు బుక్ చేసుకునేందుకు డిపోలో సంప్రదించాలన్నారు. వివరాలకు 9959226270 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న ఆలయ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపించారు. గత నెల 23వ తేదీన 'సాక్షి'లో కొమురవెల్లి మల్లన్న ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. సర్వే నంబర్ 228లో గల భూమిపై రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించారు. మక్కపల్లి చిన్న పర్వతాలు అనే వ్యక్తి ఆలయ భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టినట్లు తేలింది. దీంతో ఆలయ అధికారులు గురువారం ఆఇంటిని కూల్చివేశారు. ఈసందర్భంగా ఈఓ బాలాజీ మాట్లాడుతూ.. ఆలయ భూముల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'అరాచక పాలనకు చరమగీతం పాడాలి'

గజ్వేల్: బీఆర్ఎస్‌కు ఓటు వేయకపోతే ప్రభుత్వ పథకాలను బంద్ చేస్తామంటూ గజ్వేల్ నియోజకవర్గంలో సామాన్య ప్రజలను అధికార పార్టీ నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు కప్పర ప్రసాదరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు సింగం సత్తయ్య, టేకులపల్లి రాంరెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతల తీరుపై ధ్వజమెత్తారు. అభివృద్ధి పేరుతో రైతుల భూములు లాక్కొని వారిని అడ్డా కూలీలుగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. గజ్వేల్‌లో అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ నేతలు జశ్వంత్‌రెడ్డి, ఎల్లు రాంరెడ్డి, పిడిచెడ్ వెంకట్‌రెడ్డి, కొన్నె రాజిరెడ్డి, సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారి, గాడిపల్లి అనూప్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

కొండపాక(గజ్వేల్): కుటుంబ పాలనకు చరమగీతం పాడే అవకాశం వచ్చిందని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో రాము, మల్లేశం ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు గురువారం కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ.. 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబం సంపాదించిన అక్రమ ఆస్తులను పేదలకు చెందేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం

గజ్వేల్‌రూరల్: అన్నివర్గాలకు న్యాయం చేయడమే న్యాయ సేవా సంస్థ లక్ష్యమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సౌమ్య పేర్కొన్నారు. గురువారం అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ప్రియాంకతో కలిసి మాట్లాడారు. పారా వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వీలుకాని పక్షంలో న్యాయమూర్తుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం చేకూర్చేందుకు లోక్ అదాలత్ ద్వారా చైతన్య పరుస్తూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, న్యాయవాదులు, సోషల్ వర్కర్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ సభ్యులు దేశబోయిన నర్సింలు, సిబ్బంది నర్సింహాచారి, యామిని, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జడ్జిలు న్యాయవాదులు

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



జనగామలో మాట్లాడుతున్న కొమ్మూరి, కాంగ్రెస్‌లో చేరిన వైఎస్సార్‌టీపీ నాయకులు



కొమ్మూరి నామినేషన్‌కు తరలివచ్చిన పార్టీ శ్రేణులు, భారీ ర్యాలీ

- బీఆర్ఎస్ మాటలు నమ్మి మోసపోవద్దు
- అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపే
- జనగామ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నంబర్-1 చేస్తా
- కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి

జనగామ: స్థానికుడైన తనను ఆదరించి భారీ మెజార్టీతో గెలిపిస్తే జనగామ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి గార్డెన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో కొమ్మూరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన నామినేషన్ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు వేలాదిగా స్వచ్ఛందంగా తరలి వచ్చారన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఆశీర్వాదం తనకే ఉందని తెలిపారు. జనగామలో స్థానికేతరులకు అవకాశం ఇవ్వొద్దన్నారు. ఎన్నికల్లో ప్రతీఒక్కరి ఆశీర్వాదం కావాలని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే జనగామను రాష్ట్రంలోనే నంబర్-1గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు పని చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి గడిచిన ఎనిమిదేళ్లుగా ఎమ్మెల్సీ నిధుల నుంచి ఈ ప్రాంతానికి రూపాయి ఇవ్వలేదన్నారు. జనగామపై ప్రేమ ఉంటే నిధులు ఎందుకు ఇవ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ ప్రాంత రైతులు, ప్రజలు, యువత పడుతున్న కష్టాలను నిత్యం కళ్లారా చూస్తున్నానని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే బాధలు తొలిగి పోతాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ మాయమాటలు తప్ప, ప్రజలకు ఒరగబెట్టింది ఏం లేదన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను కాపీ కొట్టిన బీఆర్ఎస్.. ప్రజల మద్దతు పొందలేక పోయిందన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు.

వైఎస్సార్‌టీపీ నుంచి చేరికలు..

జనగామ జిల్లాలోని వైఎస్సార్‌టీపీ నాయకులు వెంకట్‌రెడ్డి, బొడ్డు ప్రవీణ్, శ్రీధర్, మంజుల తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, నాయకులు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, జిల్లెల సిద్ధారెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, ఉడుత రవి యాదవ్, చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, చారబుడ్ల రాందయాక ర్‌రెడ్డి, ఆకుల సతీష్, రజని, ఎండీ అన్వర్, ఆలేటి సిద్దిరాములు, జమాల్‌షరీఫ్, ఖాదర్, గౌస్, అజహరొద్దీన్, బనుక శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరికి మద్దతుగా మహిళా నేతల ప్రచారం

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలోని 25వ వార్డులో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొమ్మూరి కూతురు సాయి ప్రియాంకరెడ్డి, కోడలు దివ్య తదితరులు ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ, చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిరా, కౌన్సిలర్ వంగాల కల్యాణి, కాముని జయ, సుజాత, మునిబేగం ఉన్నారు.

దుర్గామాతకు పూజలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జనగామ నియోజకవర్గ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా పలువురు నాయకులు పూజలు చేసి బయలుదేరారు. నల్లగోని బాలకిషన్‌గౌడ్, వేణువందన, బాలమణి, విద్యానాథ్, ఆంజనేయులు, రమేష్, మహాత్మాచారి ఉన్నారు.



నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన కొమ్మూరి కుటుంబ సభ్యులు



నామినేషన్‌కు వెళ్లే ముందు సర్వమత ప్రార్థనలు చేస్తున్న కొమ్మూరి

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు జగ్గు మల్లారెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజాస్వామ్యంపై అవగాహన కలుగుతుందన్నారు. ఓటర్లు ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన నియామకం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన పట్ల అరుణ్‌కుమార్‌ను ఎస్‌ఏస్‌యూఐ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్, లింగాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఇళ్ల మధ్యే బాణాసంచా దుకాణాలు

హుస్నాబాద్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య దీపావళి టపాసుల దుకాణాలకు అధికారులు అనుమతి ఇవ్వడం సరికాదని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ సన్మానం

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ లెక్చరర్ గొంటి రవిని గురువారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.

◆ ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

కొమురవెల్లి(సిద్దిపేట): ఈనెల 11వ తేదీన బచ్చనపేట మండల కేంద్రంలో నిర్వహించనున్న ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మల్లన్న ఆలయ మాజీ చైర్మన్ గీస భిక్షపతి పిలుపునిచ్చారు. గురువారం మండలకేంద్రంలో ఆయన మాట్లాడారు.

◆ బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఖాయం

మర్కూక్(గజ్వేల్): బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఖాయమని బీజేపీ మండల ఇన్‌చార్జి సింగం సత్తయ్య అన్నారు. గురువారం మర్కూక్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌లో ఈటల రాజేందర్ గెలుపు ఖాయమని పేర్కొన్నారు.

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల యువకులు పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయన్నారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ఆత్మ కమిటీ డైరెక్టర్ బైరాగౌడ్, యాదయ్య, బైరారెడ్డి, పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి: మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య కాంగ్రెస్‌లో చేరినట్లు మద్దూరు జెడ్పీటీసీ గిరికొండల్‌రెడ్డి తెలిపారు. గురువారం జనగామ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మగాని శివయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొమురవెల్లి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పబ్బోజు రాములుచారి కొమ్మూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

◆ చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

వర్గల్(గజ్వేల్): మండలంలోని సింగాయపల్లి చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గౌరారం ఎస్సై విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ సాజిద్ (33)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హైదరాబాద్‌లో దావత్‌కు వెళ్లిన సాజిద్ ఆదివారం తెల్లవారుజామున తన బైక్‌పై గజ్వేల్‌కు బయల్దేరాడు. సింగాయపల్లి చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

◆ అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక(గజ్వేల్): అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన కొండపాకలో జరిగింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంకణాల మహేశ్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక గురువారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

◆ బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): బైక్ అదుపుతప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈసంఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏర్పుల మల్లేశం, గజ్జె నర్సింలు గజ్వేల్‌లో సీఎం కేసీఆర్ నామినేషన్ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తిమ్మారెడ్డిపల్లి శివారులోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి బలంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భారత జాగృతి రాష్ట్ర కోఆర్డినేటర్ అనంతుల ప్రశాంత్ పరామర్శించి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలను అందించారు.

◆ బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మద్దూరు(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట):



జనగామ గడ్డపై బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆపార్టీ మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ .. అభివృద్ధిని చూసి పల్లాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు పుట్ట వెంకటరమణరెడ్డి, ఆనందం, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండల పరిధిలోని రసులాబాద్‌కు చెందిన 30 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు.

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవు



చేర్యాల మండలంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ప్రచారంలో భాగంగా ఓ అవ్వను ఓటు అడుగుతున్న పల్లా

- 24 గంటలు కావాలా.. 3 గంటలు కావాలో ఆలోచించండి
- బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముస్త్యాల, కడవేర్గు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, నాగపురి, కాశగుడిసెలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో, 3 గంటలు చాలు అన్న కాంగ్రెస్ కావాలో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కేసీఆర్ అంటే అర్రాసు కాదు, ఆచరణ అని పేర్కొన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం రూ. 60 కోట్ల నిధులు తెచ్చానని.. అందులో రూ.10 కోట్లు చేర్యాల పట్టణం, రూ. 25 కోట్లు జనగామ పట్టణానికి, మిగిలిన రూ. 25 కోట్లు అన్ని మండలాల్లోని గ్రామాల అభివృద్ధికి కేటాయించి అభివృద్ధి చేస్తానన్నారు. కమ్యూనిటీ హాళ్లు, ఓపెన్ జిమ్, గ్రంథాలయాలు, తదితర నిర్మాణాల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి లోకల్, నాన్ లోకల్ అని విమర్శించడం మాని అభివృద్ధిలో పోటీ పడాలని సవాల్ విసిరారు. తనని గెలిపిస్తే ఎన్నికల అనంతరం నెల రోజుల్లోనే చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తూ జీఓ తెస్తానన్నారు. ఈప్రాంత అభివృద్ధికి అవసరమైన నిధులను ఈనెల 18న చేర్యాలలో జరిగే బహిరంగ సభలో సీఎం కేసీఆర్ చేత మంజూరు చేయించుకుందామన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ సారథ్యంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆర్థిక జీవన విధానాలు ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను సీఎం చేయాలని కోరారు. ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోతే ఐదేళ్లు గోస పడాల్సి వస్తుందన్నారు. తెలంగాణ తెచ్చిన, పెన్షన్ పెంచిన, 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతుబీమా ఇస్తున్న బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు.



పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ ఎంపీటీసీలు

మండల పరిధిలోని ఆకునూరు-1 ఎంపీటీసీ సభ్యుడు సుంకరి శ్రీధర్, ముస్త్యాల ఎంపీటీసీ ఎండీ ఖమర్ సుల్తానా, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండీ.అత్తార్ అహ్మద్ గురువారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తోర్ల బాలరాజు, సర్పంచ్‌లు స్వప్న, కృష్ణవేణి, సంతోషి, స్వప్న, ఎంపీటీసీ యాదగిరి, నాయకులు శ్రీనివాస్, కృష్ణ, నర్సయ్య పంతులు, గురువయ్య, విజయ్, చందు, పర్వతాలు, సదానందం, నారాయణ, కరుణాకర్, గిరిధర్, రాజేష్ పాల్గొన్నారు.

పల్లా గెలుపు జనగామ దశ, దిశను నిర్దేశిస్తుంది

జనగామ: బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు ఈ ప్రాంత దశ, దిశను నిర్దేశిస్తుందని ఆయన సతీమణి నీలిమ అన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో గురువారం ఆమె ఇంటింటా ప్రచారం చేశారు. వార్డుల్లో మహిళలు ఆమెకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి పల్లాను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఆయా వార్డుల్లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, నాయకులు, కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, బండ యాదగిరిరెడ్డి, బండ పద్మ, పేర్ని స్వరూప, లక్ష్మీశ్రీశైలం, ప్రేమలతారెడ్డి, శ్రీనివాస్, విజయ్, రాజు తదితరులు ఉన్నారు.



పార్టీ కార్యాలయం ప్రారంభించి మాట్లాడుతున్న నీలిమ

ఇంటింటా ప్రచారం

జనగామ రూరల్: జనగామ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆదరించి ఓటు వేస్తేనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.